నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శనివారం 4 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## నేడు, రేపు బర్డ్‌వాక్ ఫెస్టివల్



ఇందన్‌పెల్లి రేంజ్‌లోని ఘనిశెట్టికుంట

జన్నారం, జనవరి 3 : కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో ఈ నెల 4,5వ తేదీల్లో బర్డ్‌వాక్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు జన్నారం ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావు తెలిపారు. బర్డ్‌వాక్ ఫెస్టివల్‌కు వచ్చే ప్రేమికుల కోసం తాళ్లపేట రేంజ్ పరిధిలోని మాకులపేట బీట్‌లో బస చేయడంకోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందన్‌పెల్లి రేంజ్ పరిధిలోని ఘనిశెట్టికుంట వద్ద బర్డ్ వాక్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 3 : ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో తన నివాసంలో వాంకిడి మండలం పన్‌గూడ గ్రామానికి చెందిన మెస్రం నాగుబాయికి సీఎంఆర్ఎఫ్ చెక్కు (రూ. 28 వేలు)ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మెడికల్ కళాశాల విద్యార్థులు


## సార్లులేరు.. సౌకర్యాలు లేవు..
# చదివేదెలా?

- వెంటనే సమస్యలు పరిష్కరించాలి ● వైద్య విద్యార్థుల డిమాండ్
- ఆసిఫాబాద్ మెడికల్ కళాశాల ఎదుట రెండో రోజూ ధర్నా
- డీఎంఈ హామీతో ఆందోళన విరమణ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 3 : 'ఎంతో కష్టపడి ఎంబీబీఎస్ సీటు సాధించాం.. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు.. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలాగైతే చదువుకునేదెలా' అంటూ వైద్య విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఎదుట శుక్రవారం రెండో రోజూ ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. వెంటనే పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హుటాహుటిన డీఎంఈ డాక్టర్ వాణి కళాశాలకు చేరుకొని మొదట కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్.. ఇతర అధికారులతో సమావేశమయ్యారు. విద్యార్థులు ఆందోళన చేయడంపై ప్రిన్సిపాల్‌పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో రెండు గంటల పాటు సమావేశమయ్యారు. విద్యార్థుల సమస్యలు విని ప్రభుత్వానికి నివేదిక అందజేసి త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, అంతకుముందు ఏఎస్పీ చిత్తరంజన్ అక్కడికి చేరుకొని వారిని శాంతింపజేసే యత్నం చేశారు.

**డీఎంఈకి వినతి**

ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు జిల్లాకు వచ్చిన డీఎంఈ డాక్టర్ వాణికి వినతి పత్రం అందజేశారు. విద్యార్థులు రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కార్తీక్, దినకర్ ఉన్నారు.



సిర్పూర్(యూ) : మంచు దుప్పటిని చీల్చుకుంటూ ఉదయిస్తున్న సూర్యుడు



సిర్పూర్(యూ) : దుప్పటి కప్పుకొని గిన్నె తోముతున్న మహిళ

## ఏజెన్సీలో
# గజ గజ
### కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాపై పంజా విసిరిన చలి

- సిర్పూర్(యూ)లో అత్యల్పంగా 6.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఉదయం ఎనిమిదింటి దాకా తొలగని పొగమంచు
- చలిమంటలతో ఉపశమనం పొందిన ప్రజానీకం

*ఏజెన్సీ ప్రాంతమైన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాపై చలి పంజా విసరగా, ప్రజానీకం గజగజ వణికిపోతున్నది. మబ్బు లు పడి కొన్ని రోజుల పాటు కాస్త చలి తగ్గినా, గత నాలుగైదు రోజుల నుంచి విజృంభిస్తున్నది. సాయంత్రం ఆరింటిలోపే ప్రజలు ఇళ్లకు చేరుకుంటుండగా, రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇక ఉదయం 8 గంటలు దాటాక కూడా పొగమంచు తొలగడం లేదు. కొందరు వాహనదారులు తప్పనిసరి పరిస్థితుల్లో ఫ్లడ్ లైట్లు వేసుకొని ప్రయాణిస్తుండగా, మరికొందరు సూర్యుడు ఉదయించిన తర్వాతే ముందుకు సాగుతున్నారు. శుక్రవారం సిర్పూర్(యు)లో 6.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాగా, గడ్డకట్టుకుపోయే పరిస్థితి తలెత్తింది. ఎక్కడ చూసినా చిన్నా.. పెద్దలంతా చలిమంటలు కాగుతూ కనిపించారు. కాగా, మున్ముందు మరింత అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండగా, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అత్యవసరమై బయటకు వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.*

*- సిర్పూర్(యూ)/కెరమెరి, జనవరి 3*



కెరమెరిలో చలిమంట కాగుతున్న మహిళలు, పిల్లలు



సిర్పూర్(యూ) లో నెగడి వద్ద చిన్నారులు



సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

## సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

**మంచిర్యాల, ఆసిఫాబాద్ కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే**

నస్పూర్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 3 : మొదటి ఉపాధ్యాయురాలిగా పని చేసిన సావిత్రీబాయి పూలేను టీచర్లు ఆదర్శంగా తీసుకోవాలని మంచిర్యాల, ఆసిఫాబాద్ కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఆయా కలెక్టరేట్‌లలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధికారులతో కలిసి సావిత్రీబాయి చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బాలిక విద్యకు కృషి చేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని పేర్కొన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాళ్లను ఘనంగా సత్కరించారు. ఆయాచోట్ల డీసీపీ భాస్కర్, డీఈవో యాదయ్య, ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, జిల్లా విద్యా శాఖ సహాయ సంచాలకుడు, ప్రధానోపాధ్యాయుడు ఉదయా బాబు, గమ్మానియల్, నాయకులు శ్రీనివాస్, గోపాల్, లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు.



సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

## మెరుగైన వైద్యమందించేందుకు ప్రత్యేక కృషి

- 30 మంది వైద్యులతో ఉమ్మడి జిల్లా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీం ● ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వైద్యులపై చర్యలు
- సమస్యలుంటే 7557555777లో సంప్రదించాలి ● టీజీఎంసీ చైర్మన్ డా.ఎగ్గన శ్రీనివాస్



మాట్లాడుతున్న టీజీఎంసీ మెంబర్ డా.యెగ్గన శ్రీనివాస్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు పూజారి రమణ, ఇతర సభ్యులు

మంచిర్యాల అర్బన్, జనవరి 3 : ప్రజలకు మెరుగైన వైద్యమందించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లీగల్, ఎథికల్ అండ్ యాంటీ క్వాకరీస్ కమిటీ మెంబర్ డా.యెగ్గన శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.పూజారి రమణ అన్నారు. శుక్రవారం పాత మంచిర్యాలలోని ఐఎంఏ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమీషన్ల కోసం ప్రజలపై భారం మోపుతున్న నకిలీ వైద్యులు, వారికి సహకరిస్తున్న హాస్పిటళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి 30 మంది వైద్యులతో కూడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాస్క్ ఫోర్స్ టీంను ఏర్పాటు చేశామన్నారు. వైద్య వృత్తిపై విలువలు, నమ్మకం పెంచడమే ఈ మెడికల్ టాస్క్ ఫోర్స్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతూ.. ఆర్థిక భారం మోపుతున్న ప్రైవేట్ వైద్యులపైన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. 70 వేల మంది వైద్యుల సహకారంతో, వైద్య వ్యవస్థలో ఉన్న వివిధ సంఘాలైన ఐఎం ఏ, తానా, హెఆర్‌డీఏ, ప్రభుత్వ వైద్యులు, టీజీఎంసీ బృందంగా ఏర్పాటవుతామని తెలిపారు. వరంగల్‌లో ఇప్పటికే మెడికల్ టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మెడికల్ టాస్క్ ఫోర్స్ టీంలో ప్రజలు, న్యాయవాదులు, పోలీసులు, పత్రికా ప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లను భాగస్వాములను చేసుకొని ముందుకెళ్తామన్నారు. అనైతికంగా వై ద్యం చేస్తున్న డాక్టర్లు, హాస్పిటళ్లకు ఐఎంఏ నుంచి ఎ లాంటి సహాయ సహకారాలు అందవని వెల్లడించారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులుంటే తక్షణమే వాట్సాప్ నంబర్ 7557555777లో సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జనరల్ సెక్రటరీ డా.విశ్వేశ్వర రావు, ట్రెజరర్ డా.స్వరూపారాణి, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మద్యంపై నిషేధాజ్ఞలు కొనసాగింపు

**రామగుండం సీపీ శ్రీనివాస్**

మంచిర్యాల అర్బన్, జనవరి 3 : బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై నిషేధాజ్ఞలు కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి పాల్పడుతున్న ఆగడాలపై అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. అలాగే శబ్ధ కాలుష్యం నుంచి కాపాడేందుకు డీజే సౌండ్‌పై నిషేధాజ్ఞలు విధించినట్లు ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు ఫిబ్రవరి రెండో తేదీ వరకు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 3 : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా రవాణా శాఖ అధికారి రామచందర్ నాయక్‌తో కలిసి భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ మోహన్, ఏఎంవీఐ రాజమల్లు, ఏవో అరుణ, కానిస్టేబుల్ వాజిద్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

**ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 3 : వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. రిజిష్టర్‌లతో పాటు వంటశాల, తరగతి గదులు, నిత్యావసరాల నాణ్యతను పరిశీలించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను పరీక్షించారు. ఆయన మాట్లాడుతూ గడువులోగా సిలబస్ పూర్తి చేసి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని, నూతన మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.




విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

## సవాళ్లను ఎదుర్కొని సేవలందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ● గుడిపేట బెటాలియన్‌లో శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల అవుట్ పాసింగ్ పరేడ్ ● ఆకట్టుకున్న ప్రదర్శనలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, కమాండెంట్, డీసీపీ



ప్రతిజ్ఞ చేస్తున్న కానిస్టేబుళ్లు

హాజీపూర్, జనవరి 3 : పోలీసులు అంకిత భావంతో పని చేయాలని, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ దీపక్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో శిక్షణ పొందిన 548 మంది కానిస్టేబుళ్ల అవుట్ పాసింగ్ పరేడ్‌ను నిర్వహించారు. కలెక్టర్ దీపక్ కుమార్, బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు, రామగుండం పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డీసీపీ రాజు ప్ర త్యేక వాహనంలో పరేడ్‌ను పరిశీలించారు. పరేడ్ కమాండర్‌తో పాటు మొత్తం ఎనిమిది ప్లాటూన్ కమాండర్లు దీక్షాంత్‌పరేడ్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథి అనుమతితో కమాండెంట్ వెంకట్రాములుతో కలిసి ప్రమాణం చేసిన శిక్షణ పొందిన కానిస్టేబుళ్లు.. ఆపై పరేడ్ చేసి అంద రి హృదయాలను గెలుచుకున్నారు. కరాటే విన్యాసాలు, సైలెంట్ డ్రిల్, మార్కో కమాండెంట్ల ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లకు, శిక్షకులకు కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. అస్టిటెంట్ కమాండెంట్ నాగేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాస్, ఆర్ఎస్ఐలు రాజన్న, రవి, శేఖర్ ఆధ్వర్యంలో 45మందికి అద్భుతమైన శిక్షణ అందించారు. రామగుండం అడిషనల్ డీసీపీ రాజు, మంచిర్యాల డీసీపీ భాస్కర్, అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వరరావు, కాళిదాసు, సింగరేణి జీఎం సూర్యనారాయణ, డీఎఫ్‌వో భగవాన్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ యూనిట్ మెడికల్ వైద్యాధికారి సంతోశ్ సింగ్, ఏవో ఉమేశ్ కుమార్ పాల్గొన్నారు.

### ఆనందంగా ఉంది



మాది వ్యవసాయ కుటుంబం. పోలీసు ఉద్యోగమంటే చాలా ఇష్టం. అందుకే కష్టపడి కానిస్టేబుల్‌గా ఎంపికైన. తొమ్మిది నెలల పాటు ఇక్కడ శిక్షణ తీసుకున్న. అనేక విషయాలు నేర్చుకున్న. విధుల్లో చేరబోతున్నందుకు ఆనందంగా ఉంది. క్రమశిక్షణతో ప్రజలకు సేవలందిస్తా. *-గోపని సాయిబాబు (మేడ్చల్)*

### అమ్మ కల నెరవేర్చాం



మాది మధ్య తరగతి కుటుంబం. నాన్న ఆటో డ్రైవర్. అమ్మ లేదు. సర్కారు కొలువు సాధించాలని మా అమ్మ ఎప్పుడూ చెప్పేది. అందుకే కష్టపడి మేమిద్దరం (అన్నదమ్ములు) ఉద్యోగాలు తెచ్చుకున్నాం. ఇప్పుడు మా అమ్మ ఉంటే చాలా సంతోషించేది. అమ్మకల నెరవేరినందుకు చాలా ఆనందంగా ఉన్నాం. *- చట్ల అంటోని రాజ్, చట్ల వినోద్‌కుమార్ (మేడ్చల్)*